క్లుప్తంగా

కంటిచూపు కాపాడుకోవాలి

● వైద్యాధికారి ప్రమీలాదేవి

పూసపాటిరేగ : విద్యార్థులు కంటిచూపు కాపాడుకోవాలని వైద్యాధికారి ప్రమీలాదేవి అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నేత్రపరీక్షలు చేయు విధానంపై అవగాహన కల్పించారు. అలాగే అంధత్వ నివారణ కార్యక్రమం అవశ్యకత, గ్లకోమా, మెల్లకన్ను, శుక్లాలు, కంటి క్యాన్సర్, చక్కెర వ్యాధి వల్ల కలుగు అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఆఫ్తాలిమిక్ అధికారి మజ్జి గణపతిరావు, వైద్యసిబ్బంది వేదమణి, మహేశ్వరి, ఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



రామకోనేరు వద్ద స్వామికి అర్చనలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి మండపం వద్ద నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ రామ కోనేరు వద్దకు తీసుకువెళ్లి పుష్కరిణి వద్ద ఉంచి విశేష అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ వై. శ్రీనివాసరావు, నాయకులు సువ్వాడ రవిశేఖర్, అట్టాడ శ్రీధర్, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియ

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా) అనుసంధానం ప్రక్రియ జోరుగా సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరయ్యే వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంక్‌ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం జరగకపోవడంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ ప్రక్రియను తప్పనిసరి చేయడంతో ఖాతాదారులకు వీలుగా సచివాలయాల్లో అనుసంధానం చేపడుతున్నారు. అందరి బ్యాంక్ ఖాతాలను ఎన్‌పీసీఐ అనుసంధానం జరిపించడమే ప్రధాన కర్తవ్యమని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు.

నేడు చైల్డ్ డవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ జనరల్ ఆస్పత్రిలో బాలల దినోత్సవం సందర్భంగా చైల్డ్ డవలప్‌మెంట్ సెంటర్‌ను గురువారం ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీరామ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు సెంటర్‌ను ప్రారంభిస్తారని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆటిజం, ఏడీహెచ్‌డీ, స్పీచ్ థెరపీ, తదితర సమస్యలకు ప్రత్యేక చికిత్సలు అందించనున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలెన్నో..

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ తానే అనిత అన్నారు. స్థానిక మహాలక్ష్మి జూనియర్ కళాశాలలో వన్‌స్టాప్ సెంటర్ సేవలపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వన్‌స్టాప్ సెంటర్ ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ, సంరక్షణ కల్పిస్తుందని చెప్పారు. అదేవిధంగా వైద్య సహాయం కూడా అందిస్తుందని తెలిపారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే పోలీసులకు గాని ట్రోల్ ఫ్రీ నంబర్లు 181, 1098, 112లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిర్మాణాల తొలగింపు

విజయనగరం: నగరంలోని పూల్‌భాగ్ ప్రాంతంలో అనుమతుల్లేకుండా చేపడుతున్న భవన నిర్మాణాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది బుధవారం తొలగించారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు పూల్‌బాగ్‌లో ఓ ఇంటిపై మొదటి అంతస్తుకు సంబంధించి సెంటరింగ్, మెట్ల భాగాన్ని తొలగించినట్లు సిబ్బంది తెలిపారు. ఎవరైనా అనుమతుల్లేకుండా భవనాలు నిర్మించినట్లయితే నిర్మాణ దశలోనే తొలగించి వేస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీఎస్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆటోమొబైల్ షాపులు, ఎలక్ట్రికల్ , పండ్ల దుకాణాలపై బుధవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా 11 కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ దామోదరానాయుడు తెలిపారు. తూకంలో మోసం చేస్తున్నట్లు గుర్తించామని, ఇకపై ఇటువంటి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు.

ఎండు చేపలకు గిరాకీ..

● పూసపాటిరేగ సంతలో లక్షలాది రూపాయల వ్యాపారం
● ఇతర ప్రాంతాలకు ఎగుమతి



పూసపాటిరేగ సంతలో ఎండు చేపల వ్యాపారం

పూసపాటిరేగ: జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో గల సముద్రంలో లభ్యమయ్యే ఎండు చేపలకు మంచి గిరాకీ ఉంది. ప్రతి బుధవారం పూసపాటిరేగ జాతీయ రహదారిని అనుకుని జరుగుతున్న సంతలో ఎండు చేపల వ్యాపారం భారీగా జరుగుతోంది. శ్రీకాకుళం , పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వ్యాపారులు సంతకు వచ్చి చేపలు కొనుగోలు చేసి లారీలతో తరలిస్తుంటారు. పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి, పతివాడబర్రిపేట, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, కోనాడ.. భోగాపురం మండలంలోని చేపలకంచేరు , ముక్కాం, కొండ్రాజుపాలెం, చోడిపల్లిపేట గ్రామాలకు చెందిన మత్స్యకార మహిళలు సంతలో ఎండు చేపలను విక్రయిస్తుంటారు.

పది రోజులు ఎండబెడతారు...
వేటలో దొరికిన చేపల్లో మంచి ఖరైదైన రకాలు అక్కడిక్కడే అమ్ముడవుతాయి. మిగిలిన చేపలను ఉప్పు కలిపిన నీటిలో ఒక రోజు ఉంచిన తర్వాత ఎండలో సుమారు 10 రోజుల పాటు ఎండలో ఎండిన తర్వాత సంతకు తరలిస్తుంటారు. తీరప్రాంత గ్రామాలకు అందుబాటులో ఉన్న పూసపాటిరేగ ప్రతి బుధవారం ఎండు చేపల సంత జరుగుతుంటుంది.

నిర్వహణ లేక ఇబ్బందులు..
పూసపాటిరేగ మండలం చింతపల్లి.. భోగాపురం మండలం ముక్కాం గ్రామాలలో ప్రభుత్వం నిర్మించిన ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. పదేళ్ల కిందట రెండు కోట్ల రూపాయలతో రెండు చోట్ల ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మించినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. చేపలు ఎండబెట్టే ప్లాట్‌ఫారాలు, చేపల నిల్వ కేంద్రాలు ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారాయి. తాజాగా చింతపల్లికి మరో ఫిష్ ల్యాండింగ్ కేంద్రం మంజూరైంది. మత్స్యకారులకు అవసరమైన ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు వినియోగంలోకి తీసుకువస్తే ఎండు చేపల వ్యాపారంతో మరంత అభివృద్ధి చెందవచ్చునని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సుదూర ప్రాంతాలకు..
పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో లభ్యమయ్యే ఎండు చేపటలు ఇక్కడ నుంచి రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. పూసపాటిరేగ సంతకు వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోళ్లు చేపడతారు. ప్రతి వారం సంతలో టన్నుల కొద్దీ చేపలు అమ్ముడవుతాయి.
– వి. అప్పన్న, మత్స్యకారుడు తిప్పలవలస

అందుబాటులోకి తీసుకురావాలి..
తీరప్రాంత గ్రామాలలో ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి. కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో వేలాది రుపాయల విలువైన మత్స్య సంపద పాడవుతోంది. కనీసం చింతపల్లి, ముక్కాం గ్రామాలలో ఉన్న ఫిష్‌ల్యాండింగ్ కేంద్రాలను అయినా నిర్వహించాలి. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి.
– బర్రి అమ్మోరు , మత్స్యకారుడు, చింతపల్లి

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

● విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు



వారోత్సవాల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శ బి.లక్ష్మి

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ 57వ వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి ప్రకటించారు. ఈ మేరకు స్థానిక గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారం రోజుల కార్యక్రమాల షెడ్యూల్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలస్థాయి విద్యార్థులకు ఒక్కో అంశంపై పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొలిరోజున బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం బాలల సమ్మేళన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15న ఉన్నత పాఠశాల విద్యార్థులకు, 3, 4, 5 తరగతులకు పాఠ్యాంశాలపై క్విజ్ విజ్‌క్విజ్, 16న ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వం, 6, 7 తరగతులకు పాఠ్యాంశాలపై క్విజ్, విజ్ క్విజ్, 17న ఉన్నత పాఠశాల విద్యార్థులకు లలిత సంగీతం, 18న 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు చిత్రలేఖనం, 8, 9, 10వ తరగతులకు క్విజ్, విజ్ క్విజ్, 19న గ్రంథాలయ పాఠకులకు క్విజ్, విజ్‌క్విజ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రారంభించనున్న కలెక్టర్
వారోత్సవాల తొలి రోజున కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్, డీఈఓ యు.మాణిక్యంనాయుడు, డీపీఆర్‌ఓ డి.రమేష్ వివిధ శాఖల అధికారులు హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 20న ముగిసే ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ సేతు మాదవన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, వయోజన విద్య ఉప సంచాలకుడు ఎ.సోమేశ్వరరావు హాజరుకానున్నారని వివరించారు. సమావేశంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానిపండు తెగులుపై అప్రమత్తం

● ఏఓ నీలిమ



వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

పూసపాటిరేగ: ఖరీఫ్ వరిసాగులో వచ్చే మానిపండు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కె. నీలిమ సూచించారు. మండలంలోని లంకలపల్లిపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిసాగును పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి పైరుకు ఆశిస్తున్న మానిపండు తెగులు నివారణకు లీటర్ నీటిలో ఒక ఎం.ఎల్ ప్రాపాకొనజోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కామన్ రకం ధాన్యం క్వింటాకు రూ. 2300, గ్రేడ్-ఎ రకానికి 2320 రూపాయలుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని చెప్పారు. 2024 – 25కి రబీ సీజన్‌కు సంబంధించి రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశి క్షీరాభిషేకం



విజయనగరం టౌన్: ఉమామహేశ్వరలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు, భక్తులు

విజయనగరం టౌన్: పట్టణంలో అయ్యకోనేరు దక్షిణగట్టులో గల ఉమామహేశ్వర లింగానికి బుధవారం భక్తులు తమ స్వహస్తాలతో క్షీరాభిషేకాలు చేశారు. కార్తీకమాసం ద్వాదశి క్షీరాభిషేకం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కర్యాక్రమంలో మురపాక శ్రీనివాసశర్మ, సందీప్‌శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు.

కోనాడలో..
పూసపాటిరేగ: మండలంలోని కోనాడలో ద్వాదశి పర్వదినం సందర్భంగా తెప్పోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు, వేద పండితుడు వాడ్రేవు నాగరాజుశర్మ, కంబాపు సింహాచలం, విజ్జపు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకపోతే అపరాధ రుసుం

● కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర పరిధిలో అనుమతుల్లేని భవనాలకు సంబంధించి యజమానులకు వంద శాతం అపరాధ రుసుం విధించాలని సచివాలయ అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముందుగా యజమానులకు నోటీసులు జారీ చేయాలని చెప్పారు. అనుమతుల్లేని ఏ భవన నిర్మాణాన్నీ ఉపేక్షించవద్దని సూచించారు. అలాగే వీధులలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుకు అనుమతించవద్దని తెలిపారు. ఆస్తి పన్ను వసూలు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈ నెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు

డెంకాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ వై. మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయని, ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా పూసపాటిరేగ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం శంకర్రావు తదితరులు

పూసపాటిరేగ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి ఎం.కార్తీక్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజేతగా నిలిచాడు. ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాల విద్యార్థి అండర్-14 విభాగంలో 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థి విజేతగా నిలవడంతో హెచ్‌ఎం బి.శంకర్రావుతో పాటు ఇతర ఉపాధ్యాయిలు ఆ విద్యార్థిని అభినందించారు.

అక్షరాస్యులుగా మారాలి..

● ఎంపీడీఓ భవానీ, ఏపీఎం శ్రీనివాస్



డెంకాడ: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భవాని



భోగాపురం: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

డెంకాడ: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అందరినీ అక్షరాస్యులుగా మార్చాలన్న సంకల్పంతో పని చేయాలని ఎంపీడీఓ భవాని, ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా సీసీలు, వీఓఏలు, వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు, ఉపాధి పనులు చేస్తున్నవారు, ఇతర విభాగాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వీరికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, ఉపాధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం అక్షరాస్యత మనందరి లక్ష్యం..
విజయనగరం రూరల్: మండలంలో శతశాతం అక్షరాస్యత సాధించడం మనందరి లక్ష్యం కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో ఉల్లాస్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో వెయ్యి మంది నిరక్షరాస్యులను 120 మంది వలంటీర్లు వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పది మంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురంలో..
భోగాపురం: స్థానిక వెలుగు, మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరాల్లో ఎంపీడీఓ కిశోర్ కుమార్ అధ్యక్షతన వలంటీర్లు, టీచర్లకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. చదువురాని డ్వాక్రా మహిళలను గుర్తించి రోజూ రెండు గంటల పాటు వలంటీర్లు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణమూర్తి, ఏపీడీపీఓ తవిటినాయుడు, ఆళ్ల వైకుంఠరావు, డ్వాక్రా మహిళలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరావు



నెల్లిమర్ల: శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ రాజు

అక్షరాస్యులుగా వయోజనుల..
నెల్లిమర్ల : వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిద్దాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వెలుగు వీఓఏ, ఆర్పీలకు వయోజన విద్యపై రెండు రోజులు పాటు మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణరాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిద్దాలని సూచించారు. అనంతరం ఎంఈఓ ఈ. విజయ్‌కుమార్, ఎంఎల్‌ఓ టి.శ్రీనివాసరావు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

అన్యాయం చేయడం తగదు..



భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) యాజమాన్యం ఇటీవల ప్రవేశపెట్టిన మార్పుల వల్ల ఏజెంట్ల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఐఆర్‌డీఏ రాజకీయ వ్యవహారల కమిటీ చైర్మన్ ఎస్. గజపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) విజయనగరం బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో విశాఖ డివిజన్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల యాజమాన్యం తీసుకున్న తిరోగమన నిర్ణయాల వలన ఏజెంట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.తిరుమలరావు, ఎస్‌వీఆర్ రావు, కేవీ రమణ, బడ్డుకొండ వెంకటరమణ, ఎం.శ్రీనివాస, చిల్ల రామకృష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

మరమ్మతులు..



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫౌంటైన్‌లకు సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో గడిచిన ఐదేళ్లలో ప్రధాన జంక్షన్‌ల అభివృద్ధికి పెద్దపీట వేసిన విషయం విధితమే. కాలక్రమంలో వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో పాడయ్యాయి. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సమస్యలను గుర్తించిన కమిషనర్ నల్లనయ్య ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎంఆర్ కళాశాల జంక్షన్ వద్ద గల బుద్ధుని విగ్రహం ఫౌంటైన్‌కు బుధవారం మరమ్మతులు చేపట్టారు. – విజయనగరం

ఆర్థిక సాయం..



భోగాపురం మండలం రావాడ గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితులు పోలిపల్లి శాంతి, వరలక్ష్మి కుటుంబ సభ్యులను జనసేన పార్టీకి చెందిన నాయకులు వందనాల రమణ, మట్ట అయ్యప్పరెడ్డి, చెల్లిబోయిన నరసింగరావు, కొండపు రాధాకృష్ణ, బొల్లు త్రినాథరావు, లంక సత్యనారాయణ, తదితరులు బుధవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.15 వేల నగదుతో పాటు రూ. 10 వేల విలువ చేసే బియ్యం ప్యాకెట్లు, దుస్తులు, వంటపాత్రలు అందజేశారు. కార్యక్రమంలో జి. రాంబాబుమూర్తి, సీతంనాయుడు, పైడిరాజు, కిరణ్, సుధీర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు. – భోగాపురం

పరిశీలన..



జిల్లాలో పర్యాటకాభివృద్ధికి సహకారం అందించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌ను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోరారు. కమిషనర్‌తో కలిసి తాటిపూడి రిజర్వాయర్‌ను బుధవారం సాయంత్రం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రిజర్వాయర్‌కు అవతలి వైపు దిగువ కొండపర్తి పంచాయతీ పరిధిలో ఉన్న అతిథిగృహాలను సందర్శించారు. అలాగే పర్యాటకాభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించి, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. పర్యటనలో జిల్లా అటవీ శాఖాధికారి ప్రసూన, సీపీఓ పి.బాలాజీ, ఆర్డీఓ డీ.కీర్తి, తాహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, వీఎంఆర్‌డీఓ, ఇరిగేషన్, అటవీశాఖాధికారులు పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జననీసెషన్ కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు. 16 సంవత్సరాల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. ఇందుకోసం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు ఇంటింటినీ సందర్శిస్తున్నారు. ప్రతి బుధ, శనివారాల్లో ప్రత్యేక బృందాలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. – విజయనగరం

సఖి కార్యక్రమాలను కొనసాగించాలి

● రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ కార్యదర్శి సూర్యకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం ఫోర్ట్: పోషణ, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక విద్యా సూచికలను మెరుగుపరిచే లక్ష్యంతో 2022లో తాను ప్రారంభించిన సఖి నేడు మంచి ఫలితాలు ఇవ్వడం ఆనందంగా ఉందని ఈ కార్యక్రమాలను జిల్లాలోనే కాకుండా రాష్ట్ర మంతటా కొనసాగించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ కార్యదర్శి ఎ. సూర్యకుమారి అన్నారు. ఈ కార్యక్రమాలను కొనసాగిస్తూ బాలుర కోసం కూడా సఖివంటి గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు స్థానిక కెమిస్ట్ భవనంలో బుధవారం సఖిపై నిర్వహించిన సదస్సులో వర్చువల్‌గా ఆమె పాల్గొని మాట్లాడుతూ కౌమార దశలోనే పిల్లలకు నైతిక విలువల గురించి నేర్పించాలని సూచించారు. ప్రస్తుత సోషల్ మీడియా పరిణామాల దృష్ట్యా యువతకు సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
కలెక్టర్ బీఆర్. అంబేద్కర్ మాట్లాడుతూ బాల, బాలికలు ఇతరుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సఖి ద్వారా అనేక సవాళ్లను ఎదుర్కోవచ్చునని, ముఖ్యంగా ట్రాఫికింగ్, బాల్యవివాహాలు తదితర సమస్యల పరిష్కారానికి అస్కారం ఉంటుందన్నారు. అంతకుముందు సఖి బృందాలతో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో యనిసెఫ్ చీఫ్ జెలాలెం, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్‌కుమార్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను ఉపేక్షించం

● కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య



తాగునీరు వృథా చేస్తున్న వారిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: తాగునీటిని వృథా చేస్తే ఉపేక్షించేది లేదని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్‌లో బుధవారం ఆయన క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు అనుమతుల్లేని నిర్మాణాలు, ఆక్రమణాలను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తాగునీటిని వృథా చేస్తున్న వారి కనెక్షన్లు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పాదాలమ్మ గుడి సమీపంలో గల పార్కులో చెత్తా,చెదారాలు నిండి ఉండటాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. జేసీబీల సహయాంతో పార్కుల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి నగర ప్రజలకు నీటిసరఫరా చేస్తుంటే... వృథాగా వదిలేయడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఆర్వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఆర్ఐ కిరణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.